సాక్షి వైఎస్ఆర్ జిల్లా

శనివారం । 19 । అక్టోబర్ । 2024



పోలీసుల సంక్షేమానికి ప్రాధాన్యత

పోలీసుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తామని జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజు తెలిపారు. సిబ్బంది అంకిత భావంతో విధులు నిర్వర్తించాలని పేర్కొన్నారు. -8లో



ఇసుక పాలసీతో ప్రజలపై భారం

రాష్ట్రంలో ఎన్డీఏ ప్రభుత్వం తీసుకువచ్చిన ఇసుక, మద్యం పాలసీలు ప్రజలపై తీవ్ర ప్రభావం చూపే విధంగా ఉన్నాయని సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర పేర్కొన్నారు. -8లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం
24.1/23.2

జిల్లాలో శుక్రవారం 23.2 - 24.1 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 1.0 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

'టెట్'కు 222 మంది గైర్హాజరు

కడప ఎడ్యుకేషన్: జిల్లా వ్యాప్తంగా శుక్రవారం నిర్వహించిన ఏపీ టెట్ పరీక్షకు 222 మంది గైర్హాజరైనట్లు డీఈఓ మర్రెడ్డి అనురాధ తెలిపారు. జిల్లాలోని కడప, ప్రొద్దుటూరులో కలుపుకొని 8 పరీక్షా కేంద్రాల్లో ఉదయం, సాయంత్రం నిర్వహించిన ఏపీ టీచర్ ఎలిజిబిలిటి టెస్టు–2024కు 1589 మందికి గాను 1367 మంది హాజరు కాగా 222 మంది గైర్హాజరైనట్లు ఆమె పేర్కొన్నారు.

21న సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టాలని ధర్నా

కడప సెవెన్‌రోడ్స్: చేదోడు, తోడు, వాహన మిత్ర పథకాలను ప్రభుత్వం ప్రవేశపెట్టాలని డిమాండ్ చేస్తూ సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు జాతీయ చేతివృత్తుల ఐక్యవేదిక పార్టీ అధ్యక్షుడు అవ్వారు మల్లికార్జున శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగు నెలలైనా ఇంత వరకూ ఎలాంటి సంక్షేమ పథకాలు అమలు చేయలేదని ఆయన పేర్కొన్నారు. గత ప్రభుత్వం అమలు చేసిన పథకాలను తిరిగి ప్రవేశపెట్టాలని కోరుతూ నిర్వహించనున్న ధర్నా కార్యక్రమానికి నాయీ బ్రాహ్మణులు, రజకులు, చిన్న వ్యాపారస్తులు, ఆటో కార్మికులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

బుగ్గవంక ప్రాజెక్టుకు జలకళ



పెద్దగాడి నుంచి బుగ్గవంక ప్రాజెక్టులోకి వస్తున్న వర్షపు నీరు

కడప వైఎస్ఆర్ సర్కిల్: కడప నగర శివారులోని బుగ్గవంక ప్రాజెక్టు జలకళ సంతరించుకుంది. మూడు రోజుల పాటు కురిసిన వర్షాలకు కొండపైన ఉన్న పెద్దగాడి, చిన్న గాడి నుంచి వర్షపునీరు బుగ్గవంక ప్రాజెక్టులోకి వస్తోంది. ప్రాజెక్టు సామర్థ్యం 0.5 టీఎంసీ కాగా ప్రస్తుతం మొత్తం 189 మీటర్లకు గానూ 174 నీటిమట్టం ఉంది. ఈ నేపథ్యంలో కడప నగర ప్రజలు ప్రాజెక్టు సందర్శనకు తరలివస్తున్నారు.

ఓపెన్ స్కూల్ ఫీజుకు 25 వరకు గడువు

కడప ఎడ్యుకేషన్: ఏపీ సార్వత్రిక విద్యాపీఠం (ఏపీ ఓపెన్ స్కూల్) ద్వారా 2024–25 విద్యా సంవత్సరంలో పదో తరగతి, ఇంటర్మీడియెట్ కోర్సుల ప్రవేశం పొందుటకు ఈ నెల 25వ తేదీ వరకు గడువు ఉందని డీఈఓ మర్రెడ్డి అనురాధ, ఓపెన్ స్కూల్ జిల్లా కో ఆర్డినేటర్ కేవీ సుబ్బారెడ్డి శుక్రవారం సంయుక్త ప్రకటనలో తెలిపారు. అలాగే రూ.200 అపరాధ రుసుంతో 26 నుంచి 28 వరకు, రూ.500 అపరాధ రుసుంతో 30 నుంచి 31వ తేదీ వరకు ఫీజు చెల్లింపునకు అవకాశం ఉందన్నారు. కావున అర్హులైన అభ్యాసకులందరూ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు.

గ్రామీణులకు నాణ్యమైన సేవలు అందించాలి

చింతకొమ్మదిన్నె: గ్రామీణ ప్రాంత ప్రజలకు ఉప సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు నాణ్యమైన సేవలు అందించాలని జిల్లా పంచాయతీ అధికారి రాజ్యలక్ష్మి సూచించారు. శుక్రవారం చింతకొమ్మదిన్నె ఎంపీడీఓ కార్యాయంలో మండల పరిధిలోని ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులకు రెండు రోజుల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కులాయి బాబు, ఈఓఆర్‌డీ వెంకటసుబ్బారెడ్డి, ఎంటీలు శ్రీనివాసులు, ప్రేమలత తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఎంపీహెచ్ఎస్ పదోన్నతులు



పదోన్నతుల ప్రక్రియ నిర్వహిస్తున్న ఆర్డీ రామగిడ్డయ్య

కడప రూరల్: వైద్య ఆరోగ్య శాఖ ప్రాంతీయ కార్యాలయం జోన్–4 పరిధిలో శుక్రవారం నిర్వహించిన ఎంపీహెచ్ఎస్ (ఎఫ్) పదోన్నతులు ప్రశాంతంగా ముగిశాయి. రాయలసీమ జిల్లాల పరిధిలో పని చేస్తున్న మొత్తం ఏడుగురు ఎంపీహెచ్ఏ ఉద్యోగులకు ఎంపీహెచ్ఎస్‌గా పదోన్నతులు కల్పించారు. ఈ సందర్భంగా ఆ శాఖ రీజినల్ డైరెక్టర్ రామగిడ్డయ్య మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలు, ఉద్యోగుల సీనియార్టీ ప్రకారం ప్రమోషన్లు కల్పించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆ శాఖ సూపరింటెండెంట్ వెంకటసుబ్బమ్మ, సీనియర్ అసిస్టెంట్ వనిష తదితరులు పాల్గొన్నారు.

నకిలీ.. మకిలి!

- వైద్య ఆరోగ్య శాఖను వెంటాడుతున్న ప్రైవేటు కళాశాలల సర్టిఫికెట్ల వ్యవహారం
- ప్రభుత్వ అనుమతి లేని కళాశాలల నుంచి పొందిన సర్టిఫికెట్లతో ఉద్యోగాలు
- బోగస్ సర్టిఫికెట్ల వల్లే కొలువు కోల్పోయామంటున్న బాధితులు
- ఈ నెల 25న లోకాయుక్త విచారణకు ఉన్నతాధికారులు
- నాటి చంద్రబాబు హయాం నుంచి అదే ధోరణి
- ఆవేదనలో బాధితులు



కడపలోని వైద్య ఆరోగ్య శాఖ ప్రాంతీయ కార్యాలయం (ఇన్‌సెట్) ప్రభుత్వ గుర్తింపు పొందిన శిక్షణ సంస్థల జాబితా

సాక్షి ప్రతినిధి, కడప: వైద్య ఆరోగ్యశాఖను నకిలీ సర్టిఫికెట్ల వ్యవహారం వెంటాడుతోంది. 'అర్హులమైన మేము కాంట్రాక్టు బేసిస్ పైన, అనర్హులు రెగ్యులర్ పోస్టుల్లో కొనసాగుతున్నారు. నాటి చంద్రబాబు ప్రభుత్వ ఫలితం కారణంగా నేటికీ ఆవేదనలో ఉన్నాం' అని బాధితులు వాపోతున్నారు. గుర్తింపు లేని కళాశాలలు జారీ చేసిన సర్టిఫికెట్లకు అభ్యంతరం చెప్పాల్సిన యంత్రాంగం చెప్పలేదు. కొందరు అవినీతి అధికారుల కారణంగా యథేచ్ఛగా ఉద్యోగాలు లభించాయి. లోకాయుక్తను ఆశ్రయించినా ఉన్నతాధికారులు వాస్తవాలను కప్పిపుచ్చుతున్నారు. ఇప్పటికీ మభ్యపెట్టే పనిలోనే నిమగ్నమయ్యారని పలువురు అర్హులు వాపోతున్నారు.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కలెక్టర్ నేతృత్వంలో డిస్ట్రిక్ట్ సెలెక్షన్ కమిటీ ద్వారా పారా మెడికల్ రిక్రూట్‌మెంట్ ఉండేది. కలెక్టర్ నేతృత్వంలో రిక్రూట్‌మెంట్ ఉన్నంత కాలం అభ్యర్థుల సర్టిఫికెట్లు క్రమం తప్పకుండా వెరిఫికేషన్ ఉండేది. తద్వారా బోగస్ సర్టిఫికెట్లతో ఉద్యోగం పొందాలని అనుకునే వారు వెనక్కి తగ్గేవారు. కాగా 2002లో అప్పటి చంద్రబాబు సర్కారు రాష్ట్ర వ్యాప్తంగా పారా మెడికల్ రిక్రూట్‌మెంట్ చేపట్టింది. రాతపరీక్ష నిర్వహించి సెలెక్షన్ చేశారు. ప్రభుత్వ గుర్తింపు పొందిన శిక్షణ సంస్థలో మల్టీ పర్పస్ హెల్త్ అసిస్టెంట్ (మేల్) ట్రైనింగ్ కోర్సు పూర్తి చేసి ఉండాలి. ఆంధ్రప్రదేశ్‌లో కేవలం 10 కళాశాలలకు మాత్రమే పారా మెడికల్ బోర్డు అనుమతి ఉంది. వాటిలో సర్టిఫికెట్లు జారీ పొందిన వారంతా అర్హులు. రాష్ట్ర వ్యాప్తంగా సెలెక్షన్ చేపట్టడంతో ఇబ్బడి ముబ్బడిగా ఎలాంటి అనుమతులు లేని ప్రైవేటు కళాశాలల నుంచి సర్టిఫికెట్లు జారీ అయ్యాయి. విద్యా సంవత్సరంతో నిమిత్తం లేకుండా ప్రతి నెలా సర్టిఫికెట్లు జారీ చేసిన ఉదంతాలు వెలుగు చూశాయి. ఇలా ఆల్‌ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లోకల్ సెల్ఫ్ గవర్నమెంట్ ముంబయి/కర్నాటక.. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ అండ్ హైజీన్, న్యూఢిల్లీ.. బెతాస్ట ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ హెల్త్, శానిటేషన్ టెక్నాలజీ, విశాఖపట్నం.. ది కాలేజీ ఆఫ్ మెడికల్ టెక్నాలజీ, ఒంగోలు నుంచి ఇబ్బడి ముబ్బడిగా మల్టీ పర్పస్ హెల్త్ అసిస్టెంట్ (మేల్) ట్రైనింగ్ కోర్సు పూర్తి చేసినట్లు సర్టిఫికెట్లు లభించాయి. గుర్తింపు పొందిన కళాశాలల జాబితాలో పైన పేర్కొన్న కళాశాలలు లేకపోవడం గమనార్హం.

అర్హులకు అవకాశం కల్పించాలని..

గుర్తింపు పొందిన కళాశాలల నుంచి మల్టీ పర్పస్ హెల్త్ అసిస్టెంట్ (మేల్) ట్రైనింగ్ కోర్సు పూర్తి చేసిన తమకు ఉద్యోగాలు కల్పించాలని అనేక మంది 20 ఏళ్లుగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. దాదాపు రాష్ట్ర వ్యాప్తంగా 3 వేల మంది అనర్హులు రెగ్యులర్ ఉద్యోగం చేస్తున్నారు. అర్హులమైన తమకు ఉద్యోగాలు దక్కలేదని అర్హులు వాపోయారు. ఈ పరిస్థితుల్లో అర్హులైన వారిని కాంట్రాక్టు బేసిస్ పైన నియామకం చేపట్టారు. వాస్తవ పరిస్థితులను వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సర్కారుకు వివరించడంతో స్పందించిన అప్పటి సీఎం వైఎస్ జగన్ ఇలా కాంట్రాక్టు బేసిస్‌పై పని చేస్తున్న సుమారు 100 మందిని రెగ్యులర్ చేయాలని ఆదేశించారు. అధికారులు సత్వర చర్యలు తీసుకోవడంలో విఫలం కావడంతో మళ్లీ వీరి సమస్య మొదటికి వచ్చింది. బాధితులు కాంట్రాక్టు ఉద్యోగాలకే పరిమితం కావాల్సి వచ్చింది.

లోకాయుక్తను ఆశ్రయించిన బాధితులు

రెగ్యులర్ ఉద్యోగాల కోసం అనేక పోరాటాల తర్వాత బాధితులు లోకాయుక్తను ఆశ్రయించారు. ప్రభుత్వ గుర్తింపులేని నాలుగు ప్రైవేటు సంస్థల నుంచి సర్టిఫికెట్లు పొందిన వారి కారణంగా నష్టపోయామని వాపోయారు. సర్టిఫికెట్లు జారీ చేయడం కూడా విద్యా సంవత్సరంతో నిమిత్తం లేకుండా అన్ని నెలలు జారీ చేశారు. బోర్డు ఆఫ్ ఎగ్జామినర్‌తో నిమిత్తం లేకుండా సర్టిఫికెట్లు జారీ అయ్యాయి. అన్ని ఆధారాలను బాధితులు లోకాయుక్తకు మొరపెట్టుకున్నారు. విచారణకు స్వీకరించిన లోకాయుక్త జూలై 30న హాజరు కావాలని వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులను ఆదేశించింది. అసంపూర్తి రికార్డులతో హాజరు కావడంతో ఈ నెల 25న హాజరు కావాలని మరోమారు లోకాయుక్త ఆదేశాలు జారీ చేసింది.

ఉద్దేశ పూర్వకంగా అన్యాయం

మల్టీ పర్పస్ హెల్త్ అసిసెంట్ (మేల్) రెగ్యులర్ ఉద్యోగాలు అనర్హులకు అనేక మందికి దక్కాయి. అర్హత ఉన్న మాకు రెగ్యులర్ ఉద్యోగాలు ఇవ్వాలని అనేక సార్లు కోరినా నిష్ప్రయోజనమే అవుతోంది. సర్వీసు రూల్స్‌ను సైతం తుంగలోకి తొక్కి దశాబ్దాల తరబడి ఉద్దేశ పూర్వకంగా అన్యాయం చేస్తున్నారు. కడప వైద్య ఆరోగ్యశాఖ రీజినల్ డైరెక్టర్ పరిధిలో ఇలా 36 మంది ఉన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 100 మంది అన్యాయానికి గురయ్యారు. బోగస్ సర్టిఫికెట్ల వ్యవహారం వెలుగు చూసే అవకాశం ఉందని, ఉన్నతాధికారులు మాకు అన్యాయం చేస్తున్నారు. లోకాయుక్తలో న్యాయం లభిస్తుందని ఆశిస్తున్నాం.

– ముత్యాల బాలుడు, కాంట్రాక్ట్ ఉద్యోగి, వైద్య ఆరోగ్య శాఖ, కడప

అనర్హులకు అందలం.. అర్హులకు మొండిచేయి

దశాబ్దాలుగా న్యాయం కోసం ఎదురు చూస్తున్నాం. ప్రభుత్వ సంస్థల్లో శిక్షణ పొందిన అన్ని విధాలా అర్హులైన హెల్త్ అసిస్టెంట్లకు న్యాయం చేయకుండా, బోగస్ సర్టిఫికెట్లను ఏరివేయకుండా చట్టాలను ఉల్లంఘిస్తున్నారు. రెగ్యులర్ చేయడంలో అన్యాయం చేశారు. అనర్హులకు అందలం ఎక్కిస్తూ, అర్హులకు మొండిచేయి చూపుతున్నారు. వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారుల వింత వైఖరిపై సీఎం చంద్రబాబునాయుడు జోక్యం చేసుకొని బాధితులకు న్యాయం చేయాలని కోరుతున్నాం.

– విశ్వనాథరెడ్డి, కాంట్రాక్ట్ ఉద్యోగి, వైద్య ఆరోగ్య శాఖ, కడప

ఎవరేమన్నా.. తగ్గేదే లే..!

22, 23 తేదీల్లో సచివాలయ సెక్రటరీల బదిలీలకు కౌన్సెలింగ్

కడప కార్పొరేషన్ : ఎవరు చెప్పినా.. ఏమి చేసినా తాను అనుకున్నది చేయడంలో వెనక్కి తగ్గేది లేదని అదనపు అధికారి ముందుకెళుతున్నట్లు తెలుస్తోంది. కడప నగరపాలక సంస్థ పరిధిలోని 100 సచివాలయాల్లో పని చేస్తున్న సచివాలయ సెక్రటరీలను ఒక జోన్ నుంచి మరొక జోన్‌కు మార్చేందుకు బదిలీల కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న నేపథ్యంలో.. అదనపు అధికారి చేస్తున్న వ్యవహారంపై ఈ నెల 18వ తేదీన 'సాక్షి'లో కథనం ప్రచురితమైన సంగతి తెలిసిందే. ముందుగా నిర్ణయించిన మేరకు ఈ నెల 18, 19 తేదీలలో బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించాలని ప్రకటించినప్పటికీ టెట్ పరీక్ష ఉండటంతో వాయిదా వేశారు. బదిలీల్లో అన్నీ తానై వ్యవహరిస్తూ ... తాను మాత్రమే సెక్రటరీలను కోరుకున్న సచివాలయానికి బదిలీ చేస్తాననే రీతిలో మాట్లాడుతుండటంతో.. సెక్రటరీలు కమిషనర్‌ను కాదని అదనపు అధికారి ఛాంబర్‌కు 'క్యూ' కడుతున్నారు. సర్వసాధారణంగా ఏ బదిలీల్లో అయినా ఏ చోట ఖాళీలు ఉన్నాయో చూపిస్తూ రోస్టర్ ప్రకారం కనీసం మూడేళ్లు ఒకే చోట పని చేసిన వారిని బదిలీలకు అర్హులుగా నిర్ణయిస్తారు. 5 ఏళ్లు ఒకే చోట పని చేసిన వారిని తప్పనిసరిగా బదిలీ చేయాలనే నిబంధన విధిస్తారు. వికలాంగులు, ఉద్యోగులపై ఆధారపడిన వారు దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్నా.. ఇతర మెడికల్ గ్రౌండ్స్ కింద బదిలీలకు మినహాయింపునిస్తారు. భార్యభర్తలు ఇరువురూ ఉద్యోగులైన వారికి కూడా కొంత వెసులుబాటు కల్పిస్తారు. కానీ సచివాలయ ఉద్యోగుల బదిలీల్లో ఇవేమీ పాటించడం లేదన్న విమర్శలు ఉన్నాయి. ఓ పక్క బదిలీలు చేయరాదని ఎన్నికల కమిషన్ ఉత్తర్వులున్నా.. రాష్ట్రంలో మరే మున్సిపల్ కార్పొరేషన్, మున్సిపాలిటీల్లో ఈ తరహా బదిలీలు చేయకపోయినా ఇక్కడ మాత్రమే ఎందుకు చేస్తున్నారో ఎవరికీ అంతుచిక్కడం లేదు. ఎవరో కొందరికి మేలు చేకూర్చడానికి అందరినీ ఇబ్బందులపాలు చేస్తున్నారని సెక్రటరీలు వాపోతున్నారు.

వర్షం మిగిల్చిన నష్టం

వర్షం తీరని నష్టం మిగిల్చింది. ఆరుగాలం కష్టపడి పండించిన పంట నీటి పాలైంది. వ్యవసాయ, ఉద్యాన పంటలు భారీగా దెబ్బతిన్నాయి. దీంతో రైతులు కుదేలయ్యారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని వారు కోరుతున్నారు.

- జిల్లాలో తగ్గుముఖం పట్టిన వాన
- మూడు రోజులు దంచికొట్టిన వైనం
- దెబ్బతిన్న వ్యవసాయ, ఉద్యాన పంటలు
- కుదేలైన రైతులు



చింతకొమ్మదిన్నెలో భూమిలో నుంచి బయటికి వచ్చిన ఎర్రగడ్డలు



చెన్నూరు మండలంలో కింద పడిన వరి పంట వడ్లకు వచ్చిన మొసులు

కడప అగ్రికల్చర్: బంగాళఖాతంలో ఏర్పడిన వాయుగుండం కారణంగా జిల్లా వ్యాప్తంగా నాలుగు రోజులుగా విస్తారంగా వర్షాలు కురిశాయి. దీంతో చాలా చోట్ల ఆరుతడి పంటలు నీటి మునిగాయి. బోర్లు, నదీ పరీవాహక ప్రాంతాల్లో ముందుగా సాగు చేసిన వరి పంట కోత దశ చేరుకుంది. ఈ ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు వరి పంటంతా కిందపడి నేలపాలైయింది. కింద పడిన వరిధాన్యానికి మొలకలు వస్తాయని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. అయితే వాయుగుండం తీరం దాటడంతో వర్షం తగ్గుముఖం పట్టింది. దీంతో రైతులు కాసింత ఊపిరి పీల్చుకుంటున్నారు. ఇప్పుడిప్పుడే రైతులు పంటలను కాపాడుకునేందుకు ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టారు. కొంత మంది కిందపడిన వరిపంటను పైకి లేపి కట్టులు కడుతుండగా.. మరి కొంత మంది వరి పొలాల్లో నిలిచిన వర్షపు నీరును బయటకు పంపే పనుల్లో నిమగ్నమయ్యారు. అలాగే ఆరుతడి పంటల్లో నిలిచిన నీరు త్వరగా బయటకు పోయేందుకు కాల్వలను ఏర్పాటు చేసుకునే పనిలో ఉన్నారు. దీంతోపాటు వ్యవసాయ శాస్త్రవేత్తల సూచనల మేరకు సహాయక చర్యలు చేపట్టి పంటలు తెగుళ్ల బారిన పడకుండా పురుగుల నివారణ మందులు పిచికారీ చేయడం వల్ల పనుల్లో అన్నదాతలు బిజీగా ఉన్నారు.

వ్యవసాయ పంటలకు...

జిల్లా వ్యాప్తంగా వ్యవసాయ పంటలకు 55 గ్రామాల్లో 1909 మంది రైతులకు సంబంధించి 1433.01 హెక్టార్లలో వరి, వేరుశనగ, మినుము, మొక్కజొన్న, కంది పంటలు దెబ్బతిన్నట్లు ప్రాథమిక అంచనాలను సిద్ధం చేసి ఉన్నతాధికారులకు నివేదికలు పంపినట్లు వ్యవసాయ అధికారులు తెలిపారు. ఇందులో అధికంగా 1272.54 హెక్టార్లలో వరిపంట నేరకొరిగింది. అలాగే 122.83 హెక్టార్లలో మినుము, 21.04 హెక్టార్లలో వేరుశనగ, 16.19 హెక్టార్లలో మొక్కజొన్న పంటలు ఉన్నాయి.

ధరలు తగ్గుతాయేమోనని ఆందోళన

ఉల్లి పంట సాగుకు ఎకరాకు 60 నుంచి 70 వేల దాకా ఖర్చు పెట్టి.. తీరా చేతి కొచ్చే సమయంలో వరుణుడు రైతులను చిన్నచూపు చూశాడు. ఇంకేముంది వర్షంతో ఉల్లిగడ్డలన్నీ తడిచి దెబ్బతిననున్నాయి. దీంతో ఉల్లి ధరలు తగ్గుతాయేమోనని ఉల్లి రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం క్వింటాల్ నాణ్యతను బట్టి 2500 నుంచి 3500 వేల దాకా ధర ఉందని పలువురు రైతులు తెలిపారు. అయితే ఈ వర్షానికి గడ్డలు తడవటంతో రేటు తగ్గిస్తారేమోనని వారు ఆందోళన చెందుతున్నారు. ఏదిఏమైనా ఈ వర్షం ఉల్లి రైతులను అప్పుల ఊబిలోకి నెట్టింది.

కమలాపురంలో అత్యధికంగా వర్షం

నాలుగు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు ఇప్పటికే చాలా పంట పొలాల్లో వర్షపు నీరు అలాగే ఉంది. ఈ తరుణంలో మళ్లీ గురువారం తెల్లవారుజామున అక్కడక్కడా భారీతో పాటు ఓ మోస్తారు వర్షం కురిసింది. దీంతో కురిసిన వర్షపు నీరంతా భూమిలోకి ఇంకి పోకుండా అలాగే పొలాల్లో ఉండిపోవడంపై అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ఇందులో కమలాపురంలో అత్యధికంగా 67.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. పెండ్లిమర్రిలో 55.4 మి.మీ, సికెదిన్నె 40.4, వల్లూరు, సింహాద్రిపురం మండలాలు 22.4, ఎర్రగుంట్ల 20, వీఎన్‌పల్లి 16.4, అట్లూరు 12, వేంపల్లి 11.2, లింగాల 9.8, తొండూరు 9.2, చాపాడు 8, ఖాజీపేట, మైదుకూరు 6.4, ప్రొద్దుటూరు 5.8, మైలవరం 5, రాజుపాళెం, జమ్మలమడుగు 4.4, చెన్నూరు 4.2, పులివెందుల 3.6, బి.మఠం 3.2, కొండాపురం 2.8, వేముల 2.6, కాశినాయన 1.4, బద్వేలు 1.2, ఒంటిమిట్టలో 1 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయింది.

దెబ్బతిన్న వ్యవసాయ పంటల వివరాలు హెక్టార్లలో....

మండలం	గ్రామాలు	రైతులు	దెబ్బతిన్న పంటలు
కమలాపురం	5	151	192.03
వల్లూరు	6	477	371.31
ఒంటిమిట్ట	4	54	39.66
కలసపాడు	3	17	10.12
సిద్దవటం	10	52	25.09
బి.కోడూరు	1	22	21.04
చెన్నూరు	10	680	417.64
పోరుమామిళ్ల	6	258	141.64
చింతకొమ్మదిన్నె	2	22	10.93
పెండ్లిమర్రి	2	40	40.47
చాపాడు	2	39	25.50
కడప	1	40	80.93
ఖాజీపేట	3	57	56.65
మొత్తం	55	1909	1433.01

ఉద్యాన పంటలకు సంబంధించి హెక్టార్లలో ....

మండలం	గ్రామాలు	రైతులు	విస్తీర్ణం
ముద్దనూరు	1	41	22
దువ్వూరు	6	217	145.2
ఎర్రగుంట్ల	4	150	122
వీరపునాయునిపల్లె	7	218	184
వేంపల్లి	9	202	162
మొత్తం	27	828	635.2



చాపాడు మండలం నక్కలదిన్నెలో పంట పొలంలో నిలిచిన నీరు

ఉల్లి రైతులకు భారీ నష్టం

జిల్లా వ్యాప్తంగా ఉల్లి రైతులకు భారీ నష్టం వాటిల్లింది. ఎందుకంటే చాలా చోట్ల ఉల్లి పంట కోత దశకు చేరుకుంది. మరో రెండు, మూడు రోజుల్లో గడ్డలు తెంపుదామనుకునే తరుణంలో.. కురిసిన వర్షాలకు ఉల్లిపంట దెబ్బతినింది. జిల్లా వ్యాప్తంగా 1588 ఎకరాల్లో ఉల్లి పంట పూర్తిగా నాశనమైంది. మూడు, నాలుగు రోజులు ఎడతెరిపి లేని వర్షం కారణంగా.. నీరంతా పొలంలో నిలవడంతో గడ్డలన్నీ కుళ్లు పట్టాయని పలువురు రైతులు వాపోతున్నారు. దీంతోపాటు ఈ నెమ్ము ఆరిన తర్వాత ఉల్లిగడ్డులను తెంపినా గడ్డ కుళ్లడంతో భూమిలోనే పోతుందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా రూ.1.58 కోట్ల మేర పంటనష్టం వచ్చినట్లు ఉద్యాన శాఖ అధికారులు ప్రాథమికంగా నష్ట పరిహార అంచనాలను సిద్ధం చేశారు.



కొమ్మెద్దిలో కుళ్లిన ఎర్రగడ్డలను చూపుతున్న రైతు

ఉర్దూ యూనివర్సిటీలో పీజీ కోర్సులకు స్పాట్ అడ్మిషన్లు

వైవీయూ: కర్నూలు నగరంలోని డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీలో 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి పీజీ కోర్సుల్లో కన్వీనర్ కోటా కింద పరిమిత సంఖ్యలో మిగిలిన సీట్లకు స్పాట్ అడ్మిషన్ల కింద దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు రిజిస్ట్రార్, ప్రొఫెసర్ వి.లోకనాథ్ ఒక ప్రకటనలో తెలిపారు. విశ్వవిద్యాలయంలో ఎం.ఎ.ఇంగ్లిష్, ఎం.ఎ.ఎకనామిక్స్, ఎం.ఎ.ఉర్దూ, ఎం.ఎస్.సి కంప్యూటర్ సైన్స్, ఎం.ఎస్.సి బోటని, ఎం.ఎస్.సి జువాలజీ, ఎం.ఎస్.సి ఇండస్ట్రియల్ కెమిస్ట్రీలో విద్యార్థులను స్పాట్ అడ్మిషన్ కింద చేర్చుకునేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని ఆయన పేర్కొన్నారు. ఈ నెల 24వ తేదీ వరకు విద్యార్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీ కార్యాలయంలో హాజరై ప్రభుత్వ నిబంధనల ప్రకారం అడ్మిషన్ పొందవచ్చని సూచించారు. బాలికలకు యూనివర్సిటీలో హాస్టల్ వసతి కల్పిస్తున్నామని, అలాగే బాలురకు నగరంలోని ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లలో వసతి సదుపాయాన్ని కల్పిస్తున్నట్లు తెలిపారు. కర్నూలు నగరంలోని నలుమూలల నుంచి వచ్చే విద్యార్థులకు యూనివర్సిటీ బస్సు సౌకర్యం ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్లు : 8341511632, 9959758609 సంప్రదించవచ్చని వివరించారు.

10 నుంచి అగ్నివీర్ ఆర్మీ రిక్రూట్‌మెంట్

కడప స్పోర్ట్స్: కడప నగరంలోని జిల్లా క్రీడాప్రాధికార సంస్థ (డీఎస్ఏ) మైదానంలో నవంబర్ 10 నుంచి 15వ తేదీ వరకు అగ్నివీర్ ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ నిర్వహించనున్నట్లు జిల్లా అధికార యంత్రాంగం తెలిపింది. గుంటూరు ఆర్మీ రిక్రూటింగ్ ఆఫీస్ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ ర్యాలీలో కర్నూలు, శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు, అనంతపురం, వైఎస్ఆర్ కడప, గుంటూరు, ప్రకాశం, చిత్తూరు, బాపట్ల, పల్నాడు, నంద్యాల, తిరుపతి, అన్నమయ్య, శ్రీ సత్యసాయి జిల్లాల అభ్యర్థులు పాల్గొనవచ్చని తెలిపారు. అగ్నివీర్ జనరల్ డ్యూటీ, టెక్నికల్, ఆఫీస్ అసిస్టెంట్/స్టోర్ కీపర్ టెక్నికల్, అగ్నివీర్ ట్రేడ్‌మెన్ తదితర పోస్టులకు ఎంపికలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.జాయిన్‌ఇండియన్‌ఆర్మీ.ఎన్‌ఐసీ.ఇన్ వెబ్‌సైట్‌లో పూర్తి వివరాలు పొందవచ్చని వివరించారు. ఎంపికల ప్రక్రియ పూర్తి పారదర్శకంగా నిర్వహిస్తారని, ఎలాంటి దళారులు, ఏజెంట్లు, మోసగాళ్ల మాటలు నమ్మవద్దని సూచించారు.

క్లుప్తంగా

మట్కా నిర్వాహకుడు అరెస్టు

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప నగరం కుమ్మరి కుంటలో మట్కా రాస్తున్న నిర్వాహకుడిని అరెస్టు చేసినట్లు టూ టౌన్ సీఐ నాగార్జున తెలిపారు. సీఐ వివరాల మేరకు కడపకు చెందిన పఠాన్ అమీర్ ఖాన్ మట్కా నిర్వహిస్తున్నట్లు సమాచారం వచ్చిందన్నారు. కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు నిందితుని అరెస్టు చేసి అతని వద్ద నుండి రూ.17100 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

కాలుజారి రైలుకింద పడి మహిళ మృతి



మృతిచెందిన సుజాత

కొండాపురం : మండల కేంద్రంలోని రైల్వే స్టేషన్‌లో తిరుపతి హుబ్లీ ప్యాసింజర్ రైలు ఎక్కుతూ ప్రమాదవశాత్తూ పులిచెర్ల సుజాత(36)శుక్రవారం మృతి చెందింది. ఎర్రగుంట్ల రైల్వే పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని పరిశీలించినట్లు హెడ్ కానిస్టేబుల్ పి. రాజారాంరెడ్డి తెలిపారు. వివరాలిలా.. చిలంకూరు గ్రామానికి చెందిన సుజాత కొండాపురం రైల్వేస్టేషన్‌లో ప్యాసింజర్ రైలు ఎక్కుతూ కాలు జారి రైలుకిందపడి అక్కడిక్కడే మృతి చెందింది. మృతురాలికి వివాహమై భర్తకు దూరంగా ఉన్నట్లు ఆయన తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య



వెంకటరెడ్డి (ఫైల్)

కలసపాడు : మండలంలోని దిగువ తంబళ్ళపల్లెకు చెందిన భూమావెంకటరెడ్డి (66) అప్పుల బాధ తాళలేక ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ చిరంజీవి తెలిపిన వివరాల మేరకు.. మృతుడు గత పది రోజుల నుండి కనబడటం లేదని కుటుంబ సభ్యులు గాలిస్తున్నారు. శుక్రవారం అదే గ్రామానికి చెందిన పశువుల కాపరి దిట్టబోయినరమణయ్య గ్రామం పక్కనే ఉన్న పొలాల్లోకి పశువులను తోలుకెళ్ళాడని, ఈ క్రమంలో పొలాల్లో వెంకటరెడ్డి మృతదేహం పడి ఉన్నట్లు గుర్తించి వెంకటరెడ్డి భార్యకు తెలిపాడు. పంచె, చెప్పులను చూసి ఆ మృతదేహం తన భర్త వెంకటరెడ్డిదే అని భార్య పోలీసులకు సమాచారమిచ్చారు. అప్పుల వలన ఆత్మహత్య చేసుకొని ఉంటాడని భార్య వెంకటలక్షుమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన్నట్లు ఎస్ఐ తెలిపారు.

పోలీస్ సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యత

జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు



పోలీసు సిబ్బంది ఫ్యాన్‌లు, ఇతర సామగ్రిని అందజేస్తున్న జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు

కడప అర్బన్ : గార్డు విధుల్లోని ఏ.ఆర్. సిబ్బంది సంక్షేమంలో భాగంగా జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు శుక్రవారం సీలింగ్ ఫ్యాన్లు, బెడ్స్, వాటర్ డిస్పెన్సర్లు తదితర పరికరాలను అందజేశారు. జిల్లా పోలీసు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎస్పీ మాట్లాడారు. పోలీస్ సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తామన్నారు. సిబ్బంది అంకితభావంతో విధులను నిర్వర్తించి జిల్లా పోలీసుశాఖ ప్రతిష్టను మరింత పెంచేలా కృషి చేయాలన్నారు. మరింత సమర్థవంతంగా విధులు నిర్వర్తించేందుకు వీలుగా దైనందిన ఉద్యోగ నిర్వహణలో అవసరమైన పరికరాలు, వస్తువులు అందచేశామని ఎస్పీ తెలిపారు. సమస్యలు ఏవైనా వుంటే తన దృష్టికి తీసుకురావాలని, పరిశీలించి పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ మురళీధర్, ఆర్ఐలు ఆనంద్, వీరేష్, శ్రీశైల రెడ్డి, టైటస్, ఆర్ఎస్ఐలు, పోలీస్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు దూలం సురేష్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉప్పు శంకర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యం

పోలీసు సిబ్బంది సమస్యల పరిష్కారం కోసం శుక్రవారం జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు కడపలోని జిల్లా పోలీసు కార్యాలయంలో 'పోలీసు గ్రీవెన్స్‌డే' నిర్వహించారు. జిల్లాలో వివిధ పోలీస్‌స్టేషన్‌లు, ఆయా విభాగాలలో విధులు నిర్వర్తిస్తున్న పోలీసు సిబ్బంది బదిలీలు, వ్యక్తిగత స్పౌస్, చిల్డ్రన్ మెడికల్ సమస్యల గురించి జిల్లా ఎస్పీ స్వయంగా విన్నవించుకున్నారు. జిల్లా ఎస్పీ, సిబ్బంది సమస్యలను విని వారి సమస్యలను తగిన పరిష్కారం చూపుతామని భరోసా కల్పించారు. సిబ్బంకి ఫిర్యాదుల సమస్యలను పరిష్కరించాలని సంబంధిత జిల్లా పోలీసు అధికారులను ఆదేశించారు.

నమ్మించాడు.. నట్టేట ముంచాడు

- న్యాయం చేసే అధికారే లేరా..?
- నమ్మబలికి డబ్బులు దండుకున్న ప్రభుత్వ ఉద్యోగి
- అధికారులకు మొర పెట్టుకున్న ఫలితం శూన్యం



మాట్లాడుతున్న బాధిత రైతు కొండారెడ్డి

మైలవరం : ఇరువురు న్యాయవాదులతో మాట్లాడి కోర్టులో నడుస్తున్న పొలం తగాదాను సెటిల్ చేస్తానంటూ నమ్మబలికి.. తన నుంచి రూ.లక్షా 30 వేల నగదు తీసుకొని నట్టేట ముంచిన ప్రభుత్వ ఉద్యోగిపై చర్యలు తీసుకోవాలని ఏ అధికారికి విన్నవించినా తనకు న్యాయం జరగలేదని ఓ రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. వివరాల్లోకి వెళితే.. మైలవరం మండలం బి. జంగాలపల్లి గ్రామానికి చెందిన మునగల వెంకట కొండారెడ్డి పొలం తగాదా విషయమై ప్రొద్దుటూరు కోర్టుకు వెళుతుండేవాడు. ఈ క్రమంలో అక్కడ పనిచేస్తున్న ఓ ప్రభుత్వ ఉద్యోగి పరిచయమయ్యాడు. తాను ఇరువురు న్యాయవాదులతో మాట్లాడి న్యాయం చేస్తానని నమ్మబలికి కొండారెడ్డి నుంచి లక్షా 30 వేల రూపాయలు తీసుకున్నాడు. నెల గడిచింది. రెండు నెలల గడిచాయి. ఆరు నెలలు దాటినా అతని నుంచి ఉలుకూపలుకూ లేదు. దీంతో తన డబ్బు వెనక్కి ఇమ్మని కొండారెడ్డి ఉద్యోగిని గట్టిగా నిలదీశాడు.ఆ మొత్తానికి బాండ్లు రాయించాడు. కానీ డబ్బు ససేమిరా ఇవ్వలేదు. ప్రభుత్వ ఉద్యోగి తనను మోసపుచ్చి తనతో తీసుకున్న డబ్బును ఇప్పించాలని బాధితుడు తలమంచిపట్నం ఎస్ఐ మొదలుకొని జిల్లా ఎస్పీ వరకు మొరపెట్టుకున్నాడు. వారి మాటను ఆ ఉద్యోగి వీసామెత్తు కూడా లెక్కచేయలేదు. పోలీసుల సూచన మేరకు బాధితుడు జమ్మలమడుగు రైల్వే కోడూరు మేజిస్ట్రేట్లను కూడా కలిసి తన గోడు వినిపించాడు. ఎవరు మందలించినా ఆ ఉద్యోగి మనసు మాత్రం కరగలేదు. 75 ఏండ్లు పైబడిన పేద వృద్ధుడిని.. ఇప్పుడు అతడు రాయించిన బాండ్లు తీసుకొని కోర్టులో వేస్తే ఆ కేసు తెగేసరికి నేను ఉంటానో లేదో తెలియదు. నేను బతికుండగానే డబ్బు నాకు ఇప్పిస్తే వృద్ధాప్యంలో వైద్య ఖర్చులకు ఉపయోగపడుతుంది. ఐదు నెలలుగా అధికారుల చుట్టూ తిరుగుతూనే ఉన్నా. నాకు న్యాయం జరగడం లేదు. నాలాంటి అమాయకులను మోసగిస్తూ అధికారులను లెక్క చేయకుండా తిరుగుతున్న సదరు ప్రభుత్వ ఉద్యోగిని శిక్షించే వారే లేరా..? అంటూ మునగల వెంకట కొండారెడ్డి ఆవేదన వ్యక్తం చేశాడు. ఇప్పటికి అలసిపోకుండా ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తూనే ఉన్నాడు ఆ వృద్ధ రైతు. ఏ అధికారి కరుణిస్తాడో.. అతనికి ఎప్పుడు న్యాయం జరుగుతుందో కాలమే నిర్ణయించాల్సి ఉంది.

ఇసుక పాలసీతో ప్రజలపై భారం

సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర



కడప వైఎస్ఆర్ సర్కిల్ : రాష్ట్రంలో ఎన్డీఏ ప్రభుత్వం తీసుకువచ్చిన ఇసుక, మద్యం పాలసీలు ప్రజలపై తీవ్ర ప్రభావం చూపే విధంగా ఉన్నాయని సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తాము అధికారంలోకి వస్తే గత ప్రభుత్వ తప్పిదాలను చేయబోమని చెప్పి అధికారంలోకి వచ్చిన ఎన్డీఏ ప్రభుత్వం 100 రోజుల పాలనలో తీసుకువచ్చిన ఇసుక పాలసీ ప్రజల పాలిట శాపంగానూ, ఇంటి నిర్మాణం చేసుకునే వారికి పెను భారంగానూ మారిందన్నారు. గత ప్రభుత్వంలో ట్రాక్టర్ ఇసుక రూ. 5వేలకు వచ్చేదన్నారు. ప్రస్తుత ప్రభుత్వంలో జిల్లాలో ఏర్పాటు చేసిన ఇసుక క్వారీల నుంచి ఉచిత ఇసుక సరఫరా చేస్తున్నట్లు చెబుతున్నప్పటికీ నిర్వహణ ఖర్చుల పేరుతో ఒక టన్ను ఇసుక రూ.340 నుండి రూ.370 రూపాయలు వరకు వసూలు చేయడం వల్ల పెరిసి ట్రాక్టర్ ఇసుక రూ.6 వేలు నుంచి రూ.7 వేలు అవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. దీని పర్యవసానం నిర్మాణ రంగం పైన తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. ఎన్నికల హామీల్లో రెండవది మద్యం పాలసీ. జనాభా ప్రాతిపదికన మద్యం షాపులకు అనుమతి మంజూరు చేసి కమిషన్ల ఒప్పందాలతో షాపులు ఏర్పాటు చేశారన్నారు. ప్రస్తుత మద్యం పాలసీ ప్రజల మాన ప్రాణాలకు ఉప్పు తెచ్చే విధంగా ఉన్నదన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కేసి బాదుల్లా , వి.గంగా సురేష్ తదితరులు పాల్గొన్నారు.

నాబార్డ్ పరిధిలోని ప్రాజెక్టు పనులు పూర్తి చేయాలి

– నాబార్డ్ డీజీఎం దినీ పనీకర్



మాట్లాడుతున్న నాబార్డు డీజీఎం దినీ పనీకర్

కడప కల్చరల్ : రాయలసీమ జిల్లాల పరిధిలో నాబార్డు ఆధ్వర్యంలో ఆర్ఐడీఎఫ్ నిధులతో అమలవుతున్న ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేయాలని నాబార్డ్ డీజీఎం దినీ పనీకర్ సూచించారు. శుక్రవారం కడప నగరంలో నాబార్డ్ పరిధిలోని వివిధ ప్రాజెక్టులపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిర్దేశించిన గడువులోపు ప్రాజెక్టులను పూర్తి చేయడంతుపాటు నూతన ప్రాజెక్టులకు ప్రతిపాదనలు పంపాలని సూచించారు. నాబార్డు ఏజీఎం అరుణ్ కడిలకర మాట్లాడుతూ ఆర్ఐడీఎఫ్ నిధుల వినియోగం గురించి వివరించారు. కార్యక్రమంలో రాయలసీమ, నెల్లూరు జిల్లాలకు చెందిన అధికారులు, ఇంజినీరింగ్ సిబ్బంది పాల్గొని సందేహాలు నివృత్తి చేసుకున్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ శ్రీలక్ష్మి, అధికారులు పాల్గొన్నారు.

లింగ వివక్ష చూపే వారిపై క్రిమినల్ కేసులు

రెవెన్యూ డివిజనల్ అధికారి పి.జాన్ ఇర్వీన్



మాట్లాడుతున్న రెవెన్యూ డివిజనల్ అధికారి జాన్ ఇర్వీన్

కడప కోటిరెడ్డిసర్కిల్ : సమాజంలో ఆడపిల్లల శాతాన్ని పెంచేందుకు ప్రతి ఒకరూ కృషి చేయాలని, లింగ వివక్షతను చూపే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని రెవెన్యూ డివిజనల్ అధికారి పి. జాన్ ఇర్వీన్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయంలోని థామస్ మన్రో మీటింగ్ హాలులో రెవెన్యూ డివిజనల్ అధికారి అధ్యక్షత న పిసి పీఎన్డిటీ గర్భస్థ శిశు నిర్ధారణ పరీక్షల నిర్మూలన పై సమావేశం నిర్వహించారు. పిసి పీఎన్డిటీ జిల్లా నోడల్ అధికారి డా. ఉమ మహేశ్వర కుమార్.. సంబంధిత అధికారులతో.. సబ్ డిస్ట్రిక్ లెవెల్ మల్టీ మెంబర్ అప్రప్రియేట్ అథారిటీ కమిటీ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రెవెన్యూ డివిజనల్ అధికారి మాట్లాడుతూ బాలల లింగ నిష్పత్తిని గమనిస్తే బాలురతో పోలిస్తే బాలికల శాతం చాలా తక్కువగా ఉందన్నారు. ఈ అసమానతను తొలగించి.. సమాజంలో ఆడపిల్లల శాతాన్ని పెంచాలన్నారు. గర్భస్థ శిశు నిర్ధారణ పరీక్షలకు కారకులైన వారికి చట్టపరమైన శిక్షను కూడా విధించడం జరుగుతోందన్నారు. లింగ వివక్షతపై వ్యతిరేకిస్తూ, ధైర్యంగా ముందుకు వచ్చి ఫిర్యాదులు చేసే వారికి పిసి పీఎన్డిటీ కమిటీ అండగా ఉంటుందన్నారు. లింగ నిర్ధారణకు పాల్పడే స్కానింగ్ సెంటర్లు, వైద్యులపై చట్టపరమైన క్రిమినల్ కేసులు నమోదు చేసి.. కఠినమైన శిక్షను అమలు చేయాలన్నారు.

బకాయిలు చెల్లించండి

– ఏపీ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్



మాట్లాడుతున్న యూనియన్ నాయకులు

కడప అర్బన్ : రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు చెల్లించవలసిన బకాయిలను వెంటనే చెల్లించాలనీ ఏపీ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కంభం చిన్నయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం కడప రిమ్స్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 11వ పీఆర్‌సీకి సంబంధించిన బకాయిలు చెల్లించాలన్నారు. 12వ పీఆర్‌సీని ఏర్పాటు చేసి తక్షణమే ఐఆర్ 30 శాతం అమలు చేయాలన్నారు. సరెండర్ లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్, రెండు సంవత్సరాల బకాయిలు వెంటనే చెల్లించాలన్నారు. జీపీఎఫ్ లోన్‌లు, ఏపీజీఎల్ఐసీ బకాయిలు వెంటనే చెల్లించాలన్నారు. అలాగే 6 నెలలకు ఒకసారి చెల్లించవలసిన డీఏలు, రెండు కిస్తీలు దీపావళి సందర్భంగానైనా చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు రాము, నరసింహులు, మధుసూదన్ పాల్గొన్నారు.

తండ్రిపై మతిస్థిమితంలేని కొడుకు దాడి

పెండ్లిమర్రి : మండలంలోని తుమ్మలూరు గ్రామంలో గురువారం రాత్రి తండ్రిపై మతిస్థిమితం లేని కుమారుడు దాడి చేశాడు. విషయం ఆలస్యంగా వెలులోకి వచ్చింది. స్థానికులు, పోలీసుల కథనం మేరకు... తుమ్మలూరు గ్రామానికి చెందిన బాల్‌రెడ్డి, కుమారుడు ప్రసాద్‌రెడ్డిలు ఇద్దరు ఒకే ఇంట్లో జీవనం కోన సాగిస్తున్నారు. ప్రసాద్‌రెడ్డికి గత కొంతకాలంగా మతిస్థిమితం లేకుండా తిరుగుతుండేవాడు. అప్పుడప్పుడూ మూర్ఛతో కూడా బాధపడుతుండేవాడు. గురువారం రాత్రి ఇంట్లో ఉండగా తండ్రిపై గొడ్డలితో దాడి చేశాడు. బాల్‌రెడ్డికి తీవ్ర గాయం కావడంతో కడప రిమ్స్‌కు తరలించారు. అక్కడ నుంచి మెరుగైన చికిత్స కొంసం తిరుపతికి తరలించారు.

ఏపీ జెన్‌కోలో ఖాళీలు భర్తీ చేయాలి



మాట్లాడుతున్న గంగా సురేష్

కడప వైఎస్ఆర్ సర్కిల్ : ఏపీ జెన్‌కో ఆధ్వర్యంలోని విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలు భర్తీ చేయాలని, ఆర్‌టీపీపీ భూ నిర్వాసితులకు ఉద్యోగాలు ఇవ్వాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి వి. గంగా సురేష్ ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలలో దాదాపు 2500 పైచిలుకు ఉద్యోగ ఖాళీలు ఉన్నాయన్నారు ఇందులో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ 387, జూనియర్ ప్లాంట్ అసిస్టెంట్ 1761 , జూనియర్ అకౌంటెంట్ ఆఫీసర్ 33, జూనియర్ అసిస్టెంట్ 87, వీటితో పాటు మరిన్ని ఉద్యోగాలు ఖాళీలు ఉన్నాయన్నారు అధికారంలోకి రాగానే ఖాళీలు భర్తీ చేస్తామని కూటమి టీడీపీ, జనసేన, బీజేపీ ఎన్నికల్లో హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. ఆర్‌టీపీపీ ఏర్పాటు కోసం రైతులు భూములు ఇచ్చారని, వారికి పరిహారంగా 50శాతం ఉద్యోగాలు కల్పించాలని జీవో 98లో స్పష్టంగా చెబుతున్నా జెన్ కో యాజమాన్యం, ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా అమలు చేయలేదన్నారు. సమావేశంలో ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు బి దస్తగిరి, నగర సహాయ కార్యదర్శి సంజయ్ , వెంకటేష్ లు పాల్గొన్నారు.

జాతీయ రహదారికి అదనపు భూ సేకరణ



రెవెన్యూ అధికారులతో మాట్లాడుతున్న నేషనల్ హైవే స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వెంకటపతి

ఎర్రగుంట్ల : బెంగళూరు- విజయవాడ మధ్య నిర్మాణంలో ఆరులైన్ల జాతీయ రహదారికి సంబంధించి మూడవ అదనపు భూసేకరణ జరుగుతోంది. దీనిపై నేషనల్ హైవే స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వెంకటపతి శుక్రవారం ఎర్రగుంట్ల తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రీన్ చానల్ హైవే ఆరు లైన్ల జాతీయ రహదారి ఎర్రగుంట్ల మండల పరిధిలోని తిప్పలూరు, టీ సుంకేసుల, వై కోడూరు, పెద్దనపాడు గ్రామాల మీదుగా వెళుతుందన్నారు. ఇప్పటికే రెండు దశలలో భూ సేకరణ చేశామన్నారు. పనులు కూడా శరవేగంగా జరుగుతున్నాయన్నారు. ప్రస్తుతం మళ్లీ మూడవ అదనపు భూ సేకరణ చేస్తున్నామని చెప్పారు. అందులో తిప్పలూరు గ్రామ పరిధిలో 4.46 ఎకరాలు, టీ సుంకేసుల గ్రామ పరిధిలో 99 సెంట్లు, పెద్దనపాడు గ్రామ పరిధిలో 16.4 సెంట్లు, వై కోడూరు గ్రామ పరిధిలో 1.37 ఎకరాలు భూమి అవసరమైందన్నారు. ఈ భూముల రైతులతో మాట్లాడానికి త్వరలోనే గ్రామ సభలు నిర్వహిస్తామన్నారు. భూ ములకు ప్రభుత్వం ఒక ధర నిర్ణాయించిందని, అయితే జాయింట్ కలెక్టర్ ఆధ్వర్యంలో రైతులతో ధర విషయంపై సమావేశం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ శోభన్ బాబులతో పాటు ఇతర రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

ఆటోను ఢీ కొన్న కారు

ఒంటిమిట్ట : మండల పరిధిలోని మృకుందాశ్రమం సమీపాన గురువారం రాత్రి ఆటోను కారు ఢీ కొట్టింది. పోలీసుల వివరాల మేరకు.. రాజంపేట వైపు నుంచి వస్తున్న కారు, కడప వైపు నుంచి వస్తున్న ఆటోను మృకుందాశ్రమం సమీపానికి రాగానే ఢీ కొట్టడంతో ఆటోలో ప్రయాణిస్తున్న ముగ్గరికి గాయాలయ్యాయి. గాయాలైన వారంతా ఒంటిమిట్ట మండలంలోని రైల్వే కాలనీకి చెందిన వారుగా పోలీసులు గుర్తించారు.వారిని చికిత్స నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు శుక్రవారం కేసు నమోదు చేసిన్నట్లు పోలీసులు తెలిపారు.

డిసెంబర్ 14,15న సీపీఎం జిల్లా మహాసభలు



కరపత్రాలను అవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

కడప వైఎస్ఆర్ సర్కిల్ : డిసెంబర్ 14, 15, తేదీల్లో సీపీఎం 12వ జిల్లా మహాసభలను నిర్వహిస్తున్నట్లు సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని సీపీఎం కార్యాలయంలో జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ కరపత్రాలను అవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో మొన్న జరిగిన 18వ సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ తన సొంత బలాన్ని పూర్తిగా కోల్పోయిందన్నారు. మిత్రపక్షాలైన టీడీపీ, జేడీయూ, బాబు, నితీష్‌లపై ఆధారపడి ఎన్డీఏ ప్రభుత్వం నడుస్తోందని గుర్తు చేశారు. రాష్ట్ర ప్రజల ప్రయోజనాలను బాబు మోదీకి తాకట్టు పెడుతున్నారని, దీన్ని ప్రజలు ఎప్పటికీ క్షమించరన్నారు. మరోవైపు జనసేన పవన్ కళ్యాణ్ తన నటన చాతుర్యంతో తిరోగమన విధానాలైన ఆర్ఎస్ఎస్, వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్, బీజేపీ, సనాతన ధర్మం పేరిట మళ్లీ దేశంలో, రాష్ట్రంలో మతవ్యవస్థను, కుల వ్యవస్థను, వర్ణ వ్యవస్థను, కుల వివక్షతను ప్రోత్సహిస్తున్నారన్నారు. బీజేపీ అజెండాను నెత్తినెత్తుకొని ప్రచారం చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఐ.ఎన్. సుబ్బమ్మ, ఏ.రామ్మోహన్, బి.మనోహర్, జిల్లా కమిటీ సభ్యులు కే.శ్రీనివాసు రెడ్డి, బి.దస్తగిరి రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌జీఎఫ్ జిల్లా వాలీబాల్ జట్ల ఎంపిక



వాలీబాల్ బాలుర జట్టు



వాలీబాల్ బాలికల జట్టు

కడప స్పోర్ట్స్ : కడప నగరంలోని డాక్టర్ వైఎస్ఆర్ క్రీడా పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన ఎస్‌జీఎఫ్ జిల్లాస్థాయి వాలీబాల్ ఎంపికలకు క్రీడాకారుల నుంచి చక్కటి స్పందన లభించింది. అండర్-14, అండర్-17 బాలబాలికల విభాగాల్లో నిర్వహించిన ఈ ఎంపికలను ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి బి. అరుణకుమారి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లా జట్టుకు ఎంపికయ్యే క్రీడాకారులు బాగా సాధన చేసి రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా జట్టును విజేతగా నిలపాలన్నారు. తద్వారా జిల్లా ఖ్యాతిని చాటిచెప్పాలని ఆకాంక్షించారు. అనంతరం ఎంపికలు నిర్వహించి రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే జిల్లా వాలీబాల్ జట్లను ప్రకటించారు. కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్లు ఎల్.ఎ. సునీల్, ప్రవీణ్‌కిరణ్, కోచ్ శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు

అండర్-14 బాలికలు : వి. యశస్విని, ఓ. నేహ, ఎస్.జయప్రియరెడ్డి, జి.మునిఅర్చన, పి.కమలఅభినయ, కె.శ్రావణి, సి.సంధ్యారాణి, బి. వెంకటబిందు, టి.భువనేశ్వరి, బి.భార్గవి, ఎస్.నాగతనూజ, జి.ఎస్. గ్లోరీ.

అండర్-17 బాలికలు : ఎస్. ఆఫ్రిన్, వి. నోమిత, సి. అంజలి, బి.వైష్ణవి, ఎస్.స్వాతి, పి.నందిని, డి.మాధవి, ఎస్.సమీహ, ఎస్.సుజిత, వి.వి సూత్న, కె.సహస్ర, ఎం.కల్యాణి.

అండర్-14 బాలురు : జి.అభిషేక్, సి. నాగేంద్ర, బి.అస్ఫక్, జి.ప్రశాంత్, కె.టోనీజోనాథన్, ఐ.హేమంత్, వై.శశాంక్, రామచరణ్, సంపత్, అభిలాష్, సాయిచరణ్, డి. నితిన్.

అండర్-17 బాలురు : వై.సోను, పి.చైతన్య, ఎస్ఎండీ అనస్, ఎస్ఎండీ అయాన్, ఎ.శ్రీనాథ్, ఎం.శ్రీశాంత్, ఎస్.వెంకటసాయి, ఎస్. ధనుష్, పి.ఓంకార్, చరణ్, జశ్వంత్‌రెడ్డి, నితీష్.